


# చిత్రపటం - శ్రీకళ అబ్బరాజు

"**మా పరుచూరిలో** యింట్లో రెండు పెద్ద పెద్ద వేపచెట్లు వున్నాయి. ఇంకా నాలుగు కొబ్బరి చెట్లు కూడా వున్నాయి. వాటిలో ఒకటి 'గంగా భవాని' రకం. ఆ కొబ్బరి చెట్టు కాయల్లో నీళ్ళు తేటగా తియ్యగా 'ఎంత' బావుంటాయో! ఇంక పూలచెట్ల గురించి అయితే అడగనే అక్కర్లేదు. బోలెడన్ని. మా యింట్లో గరుడవర్ధనం చెట్టు పూలు కోసుకోడానికి ఎంతమంది వచ్చేవారనుకున్నావ్? అసలు 'గరుడవర్ధనా'లంటే తెలుసా నీకు?" లొడలొడా వాగుతున్న దాన్ని కాస్తా, ఆగి, బుజ్జిగాడి మొహంలోకి చూశాను.

"ఊహూ.. తెలీదమ్మా" ఆరేళ్ళ వయసున్న మా అబ్బాయి అమాయకంగా చెప్పాడు.

"గరుడవర్ధనాలంటే ఐదేసి రెక్కలతో వుండే తెల్లటి పూలన్నమాట. నాకింకా బాగా గుర్తు. తెల్లవారుఝామున లేచి, వాకిట్లోకి వచ్చి చూస్తే వచ్చీరాని వెలుతురులో పచ్చటి గుబురులో చిక్కుకున్న నక్షత్రాల్లాగా మెరిసిపోతూ కనిపించేవా పూలు."

నా పాటికి నేను మాట్లాడుతూనే వున్నాను. బుజ్జిగాడు వాడి పాటికి వాడు తలొంచుకుని యిడ్లీలు తింటూనే వున్నాడు.

నేను చెప్పే విషయాలు వాడికి ఒక్క ముక్క కూడా అర్థం కావడంలేదని తెలిసినా నా ఆరాటం. నా చేత వాగిస్తూనే వుంది.

వాడికి మామూలుగా మాట్లాడే తెలుగే సరిగ్గా అర్థంకాదు. నువ్వేమో గుబురూ నక్షత్రాలూ అంటూ కవిత్వం చెబితే ఏం అర్థం అవుతుంది?" అంటూ, మధ్యలో వచ్చాడు వరుణ్.

"పోనీ అర్థం చేసుకునే మీరు వింటారా?" అన్నాను యిడ్లీల ప్లేటుని ముందుకి నెడుతూ.

"ప్లీజ్" ఇక చాలన్నట్టు చెయ్యి చూపించాడు వరుణ్.

"పెళ్ళైనప్పట్నుంచీ రోజూ మీ వూరి కథ. మీ యింటి కథ వింటూనే వున్నాను. నాకింకా వేరే పనులు కూడా వున్నాయి. వదిలెయ్" అన్నాడు చిరాగ్గా.

వరుణ్ చిరాకు చూసి నాకూ కోపం వచ్చింది.

"అవును. నేను చెప్పేది మీరెందుకు వింటారు?" అన్నాను మూతి విరుస్తూ.

"ఇవాళ నాకు చాలా ముఖ్యమైన పన్లున్నాయి మహీ ప్లీజ్. త్వరగా బుజ్జిగాడిని రెడీ చెయ్యి. స్కూల్లో దించి ఆఫీసుకి వెళ్ళాలి" నా కోపంతో ఏ సంబంధం లేనట్టు, యిడ్లీ ముక్కల్ని ఒకదాని తర్వాత ఒకటి నోట్లోకి తోసేస్తూ చెప్పాడు.

ఇన్నేళ్ళ కాపురంలో వరుణ్, అలవాట్లూ, పద్ధతులూ తెలుసుకున్న నేను ఇంక మాట్లాడడం అనవసరం అని వూరుకున్నాను.

"నా ఘోష మెట్టతామర మొక్కలూ, గరుడవర్ధనం పూలూ గురించికాదు. ఆ యింటితో నాకున్న అనుబంధం గురించీ అక్కడ పెనవేసుకున్న జ్ఞాపకాల గురించీ! అది మీకెప్పటికీ అర్థంకాదు" కోపంగా అనాలనుకున్న మాటలు మనసులోనే మిగిలిపోయాయి.

బుజ్జిగాడిని తీసుకుని వరుణ్ వెళ్ళిపోతూనే, తిరిగి వంటిల్లు సర్దుకునే పనిలో పడ్డాను.

పని చేసుకుంటున్నంతసేపూ మా పరుచూరు, పరుచూరులోని మా యిల్లు మనసులో మెదులుతూనే వున్నాయి.

వరుణ్ అన్నట్టుగా ఎప్పుడు మా వూరి నామస్మరణ చేసేనేను యివాళ ఇంత ప్రత్యేకంగా తలుచుకోవడానికి మాత్రం ఒక కారణం వుంది. అది అమెరికానించి వచ్చిన మా అమ్మ ఫోను.

ఆర్నెల్ల కిందట మా అన్నయ్యకి ఆన్‌సైట్ అవకాశం రావడంతో భార్యాపిల్లలతో సహా అమెరికాకి వెళ్ళాడు. మా అమ్మ హైదరాబాదులో ఒంటరిగానే వుండేది.

నాలుగు నెలలు గడిచాక మా అమ్మకి కూడా విజిటింగ్ వీసా వచ్చింది. దాంతో ఓ ఆర్నెల్లు వుండి వస్తానంటూ అమ్మ కూడా అమెరికాకి ప్రయాణమై వెళ్ళింది.

అన్నయ్య దేశం వదిలి వెళ్ళిన దగ్గర్నుంచీ వూళ్ళో మా యింటిని పట్టించుకునే వాళ్ళే లేకపోయారు. ఆ యింట్లోకి అద్దెకి దిగినవాళ్ళు ఏవో రిపేర్లు చేయించాలని, వాట్సప్‌లో మాటిమాటికీ మెసేజీలు పెడుతూ ఫోన్లు చేస్తూ వున్నారట. దాంతో, నెలరోజుల కిందటే పూనే నుంచి హైదరాబాదుకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని వచ్చిన మాకు ఆ పనిని పురమాయించింది అమ్మ.

నాకు పెళ్ళైన తర్వాత, ఒకే ఒక్కసారి వరుణ్‌తో కలిసి పరుచూరు వెళ్ళాను నేను. ఆ తర్వాత నేను పూనే వెళ్ళడం, మా అన్నయ్యకు హైదరాబాద్‌లో ఉద్యోగం రావడంతో ఆ యింటిని అద్దెకి యిచ్చి సిటీకి వచ్చేశారు అమ్మా, నాన్నా. ఆ తర్వాత మళ్ళీ ఆ యింటిని చూసే అవకాశం నాకు రాలేదు. నాన్న బతికున్నప్పుడు 'మళ్ళీ మన వూరికి వెళ్ళి, అక్కడే వుందాం. అనేవాడట అమ్మతో'

కానీ, అనుకోకుండా నాన్న హఠాత్తుగా చనిపోయారు. ఆయన అంత్యక్రియలు కూడా హైదరాబాదులోనే జరిగాయి. ఇప్పుడు, వూరు.. వూళ్ళో యిల్లు మా జీవితాల్లో, భాగం కాదు.

అయినా నా కలల్లో, కళ్ళల్లో తరుచుగా మెదుల్తూనే వుంటుంది ఆ యిల్లు.

జీవితంలోని పరుగులూ, ఒత్తిళ్ళూ తెలియని నా బాల్యం అక్కడ ఆనందంగా గడిచిపోయింది. గతాన్ని గుర్తుచేసుకుంటే ఎన్నో మధురమైన అనుభూతులూ అనుభవాలూ అక్కడే ముడిపడి కనిపిస్తాయి.

అమ్మా, నాన్నా అన్నయ్యా నేనూ అప్పట్లో మాది చిన్న కుటుంబం. అందులో అల్లారుముద్దుగా, ఏ ఆంక్షలు లేకుండా పెరిగాను నేను. నా అల్లరికి అడ్డే వుండేది కాదు. నాకు తోడుగా 'సుజీ' కూడా బాగా అల్లరి చేసేది. సుజీ మా వూళ్ళో నా స్నేహితురాలు. ఇద్దరం మా పక్కింట్లో ఉసిరిచెట్టు కాయలు. దొంగతనంగా కోసి తినేవాళ్ళు. మునిగోరింట పూలతో వచ్చీరానట్టుగా దండ కట్టి తలలో పెట్టుకోమని సుజీ చెల్లెలు పూర్ణిమ వెంటపడే వాళ్ళం. మమ్మల్ని మేం కట్టిన దండనీ చూసి భయపడి పారిపోయేది పూర్ణి. గోరింటాకు పెట్టుకుని, ఉయ్యాల బల్ల ఎక్కితే మా అమ్మ అరిచి మొత్తుకున్నా గోరింటాకు తీసేవరకూ వుయ్యాల దిగేవాళ్ళం కాదు.

ఇలాంటి జ్ఞాపకాల్ని ఎన్నింటినో దాచుకున్న మా యింటికి, వెళ్ళిరావడానికి చాలా కాలానికి నాకు ఒక కారణం దొరికింది. ఇది అవకాశంగా తీసుకుని మళ్ళీ ఒకసారి మా యింటికి వెళ్ళిరావాలని నా ఆశ. ఈ విషయమే వరుణ్ చెవిన వేయాలని నా ఆరాటం.

"వంకాయకూర యింకొంచెం వడ్డించేదా?"

రాత్రి భోజనాల దగ్గర కళ్ళు పైకెత్తి చూడకుండానే అడిగాను వరుణ్‌ని.

"మీ వూళ్ళో దొరికే ముచ్చొంకాయలు ఇంతకన్నా బావుంటాయని చెప్పట్లేదేం?" ఆ మాట నువ్వు చెబితే అప్పుడు తింటాను ఈ కూర" అన్నాడు వరుణ్ నవ్వుతూ.

పొద్దుటి చికాకు అంతా ఎగిరిపోయి బతిమాలుకునే మూడ్‌లోకి వచ్చాడని అర్థమైంది నాకు.

భోజనాలయ్యాక బుజ్జిగాడిని పడుకోబెట్టి, వరుణ్‌కి మా అమ్మ ఫోన్ సంగతి చెప్పాను.

"దానిదేముందీ ఈ వీకెండ్ వెళ్ళి వద్దాం. కాకపోతే నాకు సెలవులు లేవు. కాబట్టి, వెంటనే తిరిగి వచ్చేయాలి" చెప్పాడు.

"నిజంగా!" ఆనందంతో ఎగిరి గంతేసినంత పని చేశాను.

"వరుణ్! నాకెంత సంతోషంగా వుందో చెప్పలేను. మనం ఆ యింటికి వెళ్ళి దాదాపు పదేళ్ళపైనే అవుతుంది కదూ! బుజ్జిగాడైతే మొదటిసారి చూడబోతున్నాడు.

నాకు తెలిసి 'సుజీ' కూడా ఆ వూళ్ళోనే వుంటోంది. దాన్నికూడా చూడొచ్చు. దిండుని పైకి జరుపుతూ, హుషారుగా చెప్పుకుపోతున్నాను.

"చాలు" నా మాటలకి మధ్యలో అడ్డుకట్టవేశాడు వరుణ్.

"నువ్వు గాల్లోకి తీరిగ్గా తేలిపోదువుగానీ. ముందు ఆ యింటికి ఏమే రిపేర్లు చేయించాలో వివరంగా కనుక్కో. మనం వెళ్ళేపని మీద ధ్యాస పెట్టు. ఇంకో విషయం ఈ పదేళ్ళలో మీ వూరి రూపురేఖలు మారిపోయి వుండొచ్చు. నువ్వు మరీ ఊహల్లో తేలిపోకు" హెచ్చరించాడు.

"నేను మరీ మీ అంత ప్రాక్టికల్‌గా ఆలోచించలేను బాబూ! అయినా ఇన్నేళ్ళలో ఏమేమి మార్పులు వచ్చి వుంటాయో ఊహించడానికి ప్రయత్నిస్తాను. మీరేం కంగారుపడక్కర్లేదు" అన్నాను నవ్వుతూ.

అనుకున్న ప్రకారం శుక్రవారం రోజు రాత్రికే బయల్దేరి గుంటూరు వెళ్ళాం. అక్కడ వరుణ్‌వాళ్ళ బంధువుల యింట్లో దిగి మర్రోజు వుదయాన్నే కారులో మా వూరికి ప్రయాణం అయ్యాం.

కారు వూళ్ళోకి వస్తూనే నాలో ఉత్సాహం రెట్టింపయ్యింది.

"అదిగో వేణుగోపాలస్వామి గుడి. ప్రహరీగోడకి సున్నం వేయించినట్టున్నారు" అంటూ కారులో నుంచే దణ్ణం పెట్టేసుకున్నాను.

"చెరువు చెరువు" అక్కడ తామరపూలు కనిపిస్తున్నాయా? అవంటే పిచ్చి యిష్టం నాకు" ఉత్సాహంగా అరుస్తూ బుజ్జిగాడికి బలవంతంగా కారు కిటికీలో నుంచి మా వూరి చెరువుని చూపించాను.

"ఇక్కడ ఆ యిటుకరాళ్ళు పేర్చి వున్నాయే అది మా గోంగూర బామ్మ వాళ్ళిల్లు. అక్కడ నుంచి నేరుగా పోనివ్వండి కారుని" చెప్పాను వరుణ్‌కి.

నా డైరెక్షన్స్‌కి పాటిస్తూ, నా రన్నింగ్ కామెంట్రీని భరిస్తూ చిన్నగా కారుని తెచ్చి యింటి ముందు ఆపాడు వరుణ్. కారు దిగుతూనే ఎదురింటి మెట్లమీద సగం నెరిసిన జుట్టుతో బక్కపలచగా వున్న ఒకావిడ,

"నువ్వు మహితవి.. కదూ! బావున్నావా!" అని పలకరించింది.

నేను ఆవిడని గుర్తుపట్టి మాట్లాడబోయేలోపే చివాలున లేచి గబగబా లోపలికి వెళ్ళిపోయిందామె.

"అమ్మా!..రా"

అలాగే నిలబడిపోయిన నేను బుజ్జిగాడి పిలుపుతో కదిలాను. గేటు తీసుకుని లోపల అడుగుపెట్టేసరికి యింటి ఆవరణ అంతా బోసిగా కనిపించింది. వాకిటి ముందు పచ్చటి హొర్మ్యాలు వుండే రెండు వేపచెట్లూ లేవు. పెరట్లో మునగచెట్టుని కూడా కొట్టేశారు.

నేను బుజ్జిగాడికి రోజుకి నాలుగుసార్లు వర్ణించి చెప్పే గరుడవర్ధనం సగానికి పైగా ఎండిపోయి వుంది.

"ఆ వేపచెట్టు ఆకులు చిమ్మలేకపోతున్నానండీ. నాకు నడుము నొప్పులు. వెన్నపూస సమస్య అని చెప్పారు డాక్టర్లు. మునగచెట్టుకి గొంగళిపురుగులు పడుతున్నాయి. మొన్ననే అది కూడా తీసేయించాము"

నా మొహంలో ప్రశార్థకం చూసి, అడగకుండానే జవాబిచ్చింది యింట్లో అద్దెకున్నావిడ.

పెరట్లో ఉన్నప్పుడు వాడిన నీళ్ళతొట్టి అలాగే వుంది. చిన్నప్పుడు నేనూ, మా అన్నయ్య వంతుల వారీగా దాన్ని నింపేవాళ్ళం. అది మానాన్న మాకు పెట్టిన రూలు.

ఆ తొట్టి దగ్గరికి వెళ్ళి, దాన్ని ముట్టుకుని చూశాను. ఎందుకో నాకు మనసులో గుర్తుండిపోయిన దానికన్నా అది చాలా చిన్నగా వున్నట్టు అనిపించింది. తొట్టేకాదు. యిల్లు కూడా చిన్నదిగా, యిరుగ్గా కనిపించింది. ఇంట్లో అద్దెకున్నవాళ్ళది చెప్పుల వ్యాపారం. ముందున్న రెండు గదుల్లో చెప్పుల అట్టపెట్టెలు పేర్చి పెట్టడంతో యిల్లంతా చీకటిగా వుంది. గాలి పారక ఒక రకమైన వాసన కూడా.

వరండాలో మేం వదిలి వెళ్ళిన టేకు ఉయ్యాలబల్ల మాత్రం అలాగే వుంది. బుజ్జిగాడు కాస్సేపు ఉయ్యాలూగి, పెరట్లో నూతి దగ్గరికి పరిగెత్తాడు. అది చూసి వెనకాలే నేనూ పరిగెత్తాను. చేదతో బావిలో నుంచి నీళ్ళు తోడి యిస్తే చల్లటి నీళ్ళు మొహం మీద పోసుకుని కిలకిలా నవ్వాడు. ఇంట్లో వున్న వాళ్ళ పిల్లలతో బుజ్జిగాడికి స్నేహం కుదిరింది. కాస్సేపు ఆడుకున్నాడు.

మేం పెత్తనాలు చేస్తుంటే వరుణ్ మాత్రం "శ్లాబ్‌లో ఎక్కడ లీకవుతుంది? ఏయే తలుపులు బాగు చేయించాలి?" అని అద్దెకున్నాయనతో మాట్లాడుతూ వున్నాడు. అలా ఓ గంట గడిచిపోయింది.

రిపేర్లు చేయడానికి మనుషుల్ని పురమాయించే పని పూర్తయ్యాక మధ్యాహ్నం మా గోంగూర బామ్మ వాళ్ళింట్లో భోజనం చేసి సాయంత్రం తిరుగు ప్రయాణం కట్టాము.

ఊరు నుంచి తిరిగి వచ్చి, అప్పటికి రెండు రోజులయ్యింది.

వంటపని పూర్తవుతూనే చల్లగాలి కోసం వరండా మెట్లమీదకి వచ్చి కూర్చున్నాను. వరుణ్ యింకా యింటికి రాలేదు.

బుజ్జిగాడు లోపల కూర్చుని రాసుకుంటూ వున్నాడు.

చూస్తూ వుండగానే ఆకాశం నల్లబడిపోయింది. మినుకు మినుకుమంటూ మెరుస్తున్న నక్షత్రాలు ఒక్కొక్కటిగా బైటికి వచ్చాయి.

వాటిని చూస్తుంటే మా నాన్న జ్ఞాపకానికి వచ్చాడు. నేను చిన్నపిల్లగా వున్నప్పుడు మా యింట్లో ఆరుబయట మంచం మీద మా నాన్న చేతిని పట్టుకుని నక్షత్రాల్ని చూస్తూ నిద్రపోవడం గుర్తొచ్చింది.

"ఏంటీ దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?"

ఎప్పుడు వచ్చాడో వరుణ్ నా ఎదురుగా నిలబడి అడుగుతున్నాడు. "ఏం లేదు" తల అడ్డంగా వూపాను.

"వూళ్ళో మీ యింటిని చూసినప్పట్నుంచేనా నీకీ వైరాగ్యం ఓ పని చేద్దాం. ఆ యింటిని బాగు చేయించి, తిరిగి నువ్వు చెప్పే మెట్టతామరలూ గరుడవర్ధనాలూ పెంచుదాం. మళ్ళీ వేపమొక్కలు నాటి నువ్వు కోరుకున్నట్టే తయారుచేద్దాం. ఈసారి యింటిని అద్దెకి యివ్వకుండా మన కిందే వుంచుకుని, సెలవులకి వెళ్తూ, వస్తూ వుందాం. సరేనా?"

నాలో ఉత్సాహాన్ని నింపడానికన్నట్టుగా నవ్వుతూ అన్నాడు.

"వద్దు వరుణ్" చెప్పాను ఠక్కున.

"ఏమైంది మహీ"

నా పక్కన కూర్చుంటూ అడిగాడు వరుణ్.

"కావాలంటే మొక్కల్నీ, చెట్లనీ మనం కోరుకున్నట్టుగా తిరిగి పెంచుకోవచ్చు. కానీ కొన్నింటిని మనం తిరిగి తీసుకురాలేము వరుణ్. ఆ యింట్లో అమ్మా, నాన్నా, అన్నయ్యా, నేనూ చాలు ఆనందంగా గడిపాం. గొప్ప సుఖాలు లేకపోయినా, ఎటువంటి కష్టాలూ, సమస్యలూ ఉండేవి కావు. మాకు. మా నాన్న సజీవంగా వున్నప్పటి జ్ఞాపకాలే ఆ యింట్లో వున్నాయి. పిల్లాపాపలతో అన్యోన్యంగా హాయిగా జీవితం గడిపిన ఓ జంట. స్నేహితులతో ఆడుతూ, పాడుతూ పెరిగిన యిద్దరు పిల్లలు. ఇదే ఆ యింటిలో మాకున్న అనుబంధం, ఎప్పుడు ఆ యింటిని తలుచుకున్నా అదే గుర్తుకు రావాలి. కాలాన్ని అక్కడికి బంధిస్తేనే అది ఒక అందమైన వర్ణ చిత్రం.

దాన్ని దాటి చూస్తే ఒక్కో రంగూ వెలిసిపోతూ కనిపిస్తూ వుంది. ఈ విషయం నాకు, ఆ యింట్లో మా నాన్న తాలూకు జ్ఞాపకాలు మనసుని తాకిన తర్వాత వెలిసిపోయిన సుజీ మొహం చూసిన తర్వాతనే అర్థం అయ్యింది.

మనం కారు దిగుతూనే మొదటగా నన్ను పలకరించింది నా క్లోజ్ ఫ్రెండ్ సుజాతే.

కాలం తనని బాగా కుంగదీసింది. మా యిద్దరి పరిస్థితుల్లో అంతరాన్ని గుర్తిస్తూనే నాతో మాట్లాడడానికి యిష్టపడలేదు.

మనం అక్కడ్నుంచి బయల్దేరే ముందు నేను వెళ్ళి 'సుజీ' కలిశాను. మొదట. కాస్త యిబ్బందిపడ్డా. తర్వాత బానే మాట్లాడింది కానీ చిన్నప్పటి 'సుజీ' కాలేకపోయింది. నేను ఆ విషయాలన్నీ తనకి గుర్తుచేయదలుచుకోలేదు కూడా.

"నీకే అవసరం వచ్చినా నాకు ఫోన్ చెయ్యి" అని మాత్రమే చెప్పగలిగాను. వర్తమానంలో యిబ్బందులు పడుతున్న వ్యక్తి, గతాన్ని తలుచుకుని సంతోషించడం కష్టం అన్న విషయం అర్థం చేసుకున్నాను.

మనిషి జీవనపోరాటంలో గెలిస్తేనే ఊహా ప్రపంచాన్ని బతికించుకోగలడు. ఆ విషయం అర్థం అయ్యాక.

ఆ యింట్లో చెప్పుల వాసన కూడా నాకు బాగా నచ్చింది. నాకు సంబంధించిన వరకూ నా మనసులో మిగిలిపోయిన 'ఆ అందమైన చిత్రపటం' చాలు. ఆ యింట్లో ఆ చిన్న కుటుంబాన్ని అలాగే వుండనిద్దాం" అన్నాను ఉద్వేగంగా.

వరుణ్ నా వంక మెచ్చుకోలుగా చూశాడు.

"మరి యిన్ని తెలిసి ఎందుకు మొహం వేళ్ళాడేసుక్కూర్చున్నావు?" అడిగాడు విచిత్రంగా చూస్తూ.

"బావుంది. నీతులు చెప్పడం ఎవరికైనా తేలికే. కానీ, మనసుని సమాధానపర్చుకోవద్దూ. ఎంతలేదన్నా ఆ యింట్లో సగం ఎండిపోయిన గరుడవర్ధనం చెట్టు గుర్తొస్తే బాధగా వుంది. ఆ చెట్టుకి సరిగ్గా నీళ్ళు పోయమని మరీ మరీ చెప్పొచ్చాను వాళ్ళకి"

నేను మాట్లాడుతూ వుండగానే బుజ్జిగాడు లోపలి నుంచి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అమ్మా! ఇది చూడు" అంటూ నా చేతిలో ఒక కాగితాన్ని పెట్టాడు.

"ఇది యిల్లు. ఇదేమో బావి. ఇది గరుడవర్ధనం" అంటూ రంగులు వేసిన బొమ్మల్ని చూపించాడు. చిన్న ఆకుపచ్చని కొండమీద తెల్లటి ముద్దల్లా వున్న గరుడవర్ధనాల్ని చూసి ఫక్కున నవ్వాం నేనూ, వరుణ్.

Click here to share your comments on this story